



డింపుల్.. బ్యూటీఫుల్

నటి డింపుల్ హాయతీ శుక్రవారం జహీరాబాద్‌లో సందడి చేశారు. ఓ మొబైల్ షాపుకు వచ్చిన ఆమెను చూసేందుకు అభిమానులు పెద్దసంఖ్యలో రావడంతో బస్టాండ్ ప్రాంతం రద్దీగా మారింది. తనను చూడడానికి వచ్చిన అభిమానులకు ఆమె అభివాదం చేశారు.

-జహీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి)

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ

సంగారెడ్డి ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి పాత బస్టాండ్ అంబేద్కర్ చౌక్ వరకు పాదయాత్ర

ర్యాలీలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



సంగారెడ్డిలో నిర్వహించిన భారీ ర్యాలీలో ప్లకార్డు పట్టుకొని నడుస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డిలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీని నిర్వహించారు. సంగారెడ్డి ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి పాత బస్టాండ్ అంబేద్కర్ చౌక్ వరకు పాదయాత్ర చేపట్టారు. జగ్గారెడ్డి ప్లకార్డు పట్టుకొని నడుస్తూ కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ర్యాలీలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.


ర్యాలీలో జగ్గారెడ్డితోపాటు నిర్మలా జగ్గారెడ్డి, శివసేనారెడ్డి

ఎండిన మడి.. రైతు కంట తడి

సింగూరు కాల్వల సీసీ లైనింగ్ పనులతో యాసంగికి క్రాప్‌హాలిడే

- సమాచారం లేక వరి సాగు చేసిన అన్నదాతలు
- సింగూరు ప్రాజెక్టు నుంచి విడుదలకు నోచుకోని సాగునీరు
- అందోలు డివిజన్‌లో 4వేల ఎకరాల్లో ఎండిన వరి
- దిక్కుతోచని రైతులు.. పశువులను మేపుతున్న వైనం

అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. సాగునీరు లేక చేతికొచ్చిన పంట ఎండుతుండటంతో మూడు మండలాల రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగిలో మంజీరా ప్రాజెక్టు నీరు అందకపోవడంతో అందోలు డివిజన్ పరిధిలోని అందోలు, పుల్కల్, చౌటకూరు మండలాల్లో ఎక్కడికక్కడ పొలాలు ఎండిపోతున్నాయి. ఎప్పటిలా సింగూరు ప్రాజెక్టు నుంచి సాగునీరు వస్తుందనే ధీమాతో జోరుగా వరినాట్లు వేసిన రైతులు.. క్రాప్‌హాలిడే కారణంగా నీరు రాదని తెలిసి ఉసూరుమంటున్నారు.


చందంపేటలో ఎండిన పొలంలో పశువులను మేపుతున్న రైతు

జోగిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అందోలు నియోజకవర్గ పరిధిలో మంజీరా నదిపై నిర్మించిన సింగూరు ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వ ద్వారా డివిజన్‌లో అందోలు, పుల్కల్, చౌటకూరు మండలాల్లోని సుమారు 45 వేల ఎకరాల ఆయకట్టుకు ప్రతీ యేటా యాసంగిలో నీటిని విడుదల చేస్తారు. కాల్వల ద్వారా ఆయా గ్రామాల్లోని చెరువుల కుంటల్లోకి చేరిన నీటితో పొలాలు సాగుచేస్తారు. నిర్వహణ సరిగాలేక కాల్వలు పిచ్చి మొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయి చివరి వరకు నీరు చేరడం లేదు. దీంతో, మంత్రి దామోదర్ సింగూరు కాల్వల నుంచి సజావుగా నీటి పారకం సాగేందుకు వీలుగా కాల్వలకు సీసీ లైనింగ్ చేయించడానికి పూనుకున్నారు. ఆయన చొరవతో రాష్ట్ర ప్రభుత్వం గత నవంబర్‌లో రూ. 136 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఆర్థిక శాఖ క్లియరెన్స్, టెండర్ల ప్రక్రియలు పూర్తయ్యాక గత నెలలో కాల్వల సీసీ లైనింగ్ పనులను ప్రారంభించారు. మొదటి దశలో కాల్వల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించే పనులను కొనసాగుతున్నాయి. ఈ పనులను దృష్టిలో ఉంచుకుని యాసంగి సీజన్‌కు క్రాప్‌హాలిడే ప్రకటించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. గత డిసెంబరులో కలెక్టర్ వల్లూరు క్రాంతి అధ్యక్షతన సమావేశమైన ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డ్ సభ్యులు యాసంగికి క్రాప్‌హాలిడేను ప్రకటించారు. తద్వారా యాసంగికి కాల్వల ద్వారా నీటి సరఫరాను నిలిపివేశారు.

చెరువులోకి నీళ్లు వదలక పంట ఎండింది



యాసంగిలో రెండెకరాల్లో వరి నాట్లు వేశాను. మొదట్లో బోరు ఆధారంగా తడులు అందించాను. చెరువులు, కుంటల్లోకి నీరు వదలకపోవడంతో బోరు ఎండిపోయింది. పొట్ట దశలో ఉన్న వరి ఎండిపోవడంతో పశువులను మేపుతున్నాను.

-పాపగారి నర్సింహులు, చందంపేట

సింగూరు నీళ్లు రావని చెప్పలేదు



యాసంగిలో క్రాప్‌హాలీడే ప్రకటించిన సంగతి రైతులెవరికీ చెప్పలేదు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా కాల్వల్లో నీరు వస్తుందనే ధీమాతో యాసంగిలో ఏడెకరాల్లో వరి నాట్లు వేశాం. పంట పొట్టకొచ్చినా కాల్వల నుంచి నీటి విడుదల చేయక మొత్తం ఎండిపోయింది.

- ఎర్రారం వీరేశ్, అల్మాయిపేట

సమాచార లోపం.. రైతుకు శాపం

ఇంతవరకూ బాగానే ఉన్నా క్రాప్‌హాలీడే ప్రకటించిన సంగతిపై జిల్లా యంత్రాంగం కానీ, సంబంధిత శాఖలు కానీ ప్రచారం చేయలేదు. ఆయకట్టుకు రైతులకు ఈ విషయంపై

మిగతా 8వ పేజీలో


శిలువను ఊరేగిస్తున్న మతపెద్దలు

మెదక్ సీఎస్ఐలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ కేథడ్రల్ చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం ఉదయం శిలువను ఊరేగించి ప్రతిష్ఠించిన అనంతరం ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవ సందేశాన్ని వినిపించారు. ప్రేమ, దయ, శాంతి, సహనం, త్యాగం శత్రువునైనా ప్రేమించే గుణం ప్రతి ఒక్కరు కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా పలు బృందాలు ఆలపించిన ఏసయ్య భక్తి గీతాలు అలరించాయి. అనంతరం మతగురువులు భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రార్థన మందిరంతో పాటు పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున్న భక్తుల కోసం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మతగురువులు రిచర్డ్, జైపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


గుడ్ ఫ్రైడే ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు

7లో



నారాయణఖేడ్‌లో నిరసన ర్యాలీలో ముస్లింలు

అకాల వర్షం.. అన్నదాత ఆగం



- కొట్టుకుపోయిన ధాన్యం
- పలు చోట్ల విరిగిపడిన చెట్లు, స్తంభాలు
- ఎగిరిపోయిన పైకప్పులు

చేగుంట మండలం వడియారం బైపాస్ రోడ్డులో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 18: మెదక్, సంగారెడ్డి మండలాల్లో వరుసగా రెండో రోజూ పలు మండలాల్లో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. పెద్దఎత్తున గాలులు వీయడంతో ప్రజలు భయాందోళనకు లోనయ్యారు. పలు చోట్ల ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి. చేతికొచ్చిన వరి నేలకొరిగింది. రోడ్లపై ఆరబోసిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. ఝరాసంగం మండలం బొప్పన్‌పల్లిలో పిడుగుపాటుకు ఎద్దు మృతిచెందింది. ఓ ఇంటిపై విద్యుత్ స్తంభం విరిగిపడింది. కంగ్టి మండలం చుక్కల్‌తీర్థ్‌లో అపోస్తలిక్ చర్చిపైకప్పు రేకులు ఎగిరిపోవడంతో ప్రార్థనలు చేస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లో రైల్వే అండర్ బ్రిడ్జిలో వద్ద మోకాలు లోతు నీళ్ల నిలువడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. మెదక్ జిల్లా చేగుంటలో ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. చెట్లు నెలకొరిగాయి. పలు గ్రామాల్లో వడగళ్లు పడ్డాయి. మాసాయిపేట, వెల్దుర్తి మండలాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది.

అరగంట వాన.. అపార నష్టం

నర్సాపూర్ మండలంలో గురువారం సాయంత్రం కురిసిన వడగళ్లవానకు 925 ఎకరాల మేర పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మురళీధర్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్ తదితరులు పరిశీలించారు.


ఝరాసంగం మండలం బొప్పన్‌పల్లిలో ఎగిరిపోయిన పైకప్పు



మహిళలకు చేయూత

- ఉపాధికి ఊతమిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాలు
- ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ
- కోల్ ఇండియా సౌజన్యంతో వివేకానంద ఇనిస్టిట్యూట్ కార్యక్రమం

7

కోతల జోరు.. ఖర్చుతో బేజారు

అకాల వర్షాలతో హార్వెస్టర్లకు పెరిగిన డిమాండ్

7

వట్‌పల్లి మండలంలో లిఫ్ట్‌కు త్వరలో సర్వే

- నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

రాయికోడ్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వట్‌పల్లి మండలంలో నూతన లిఫ్ట్ ఇరిగేషన్ కోసం త్వరలోనే సర్వేలు నిర్వహిస్తామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాయికోడ్‌లో మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం రాయికోడ్ డివిజన్ ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని బొగ్గులంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ కోసం మరో రూ. 80 లక్షల నిధులు కేటాయించామని, వట్‌పల్లి మండలంలో కొత్త లిఫ్ట్ ఏర్పాటుకు త్వరలో సర్వేలు నిర్వహిస్తామన్నారు. సింగితం, కంకోల్, వట్‌పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అల్లాపూర్ శివారులో రూ. 5కోట్లతో గోదాం నిర్మిస్తామని చెప్పారు. అందోలు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పుష్కలంగా నిధులు విడుదల చేస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. పేదల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ కచురరావు, నాయకులు మల్లిఖార్జున్‌పాటిల్, సిద్దన్నపాటిల్, బస్వరాజ్‌పాటిల్, సుధాకర్‌రెడ్డి, బాలాజీ నర్సింహులు, కేదర్‌నాథ్‌పాటిల్, సతీష్ కులకర్ణి, ప్రభాకర్‌చారి, సతీష్‌కుమార్, శేషారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

విద్వేషాలను రెచ్చగొడితే కఠిన చర్యలు : ఎస్పీ


ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కుల, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వాఖ్యలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టులు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఎవరూ వాఖ్యలు చేయొద్దని అన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు, ఫార్వర్డ్ మెసేజ్‌లు చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు హిస్టరీషీట్లు ఓపెన్ చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. సమాజంలో అన్నివర్గాలు పరస్పరం గౌరవించుకునప్పుడే మత సామరస్యం వెల్లివిరిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలని కోరారు.

ఆర్టీసీ క్యూఆర్ కోడ్‌తో కీ చైన్లు

జహీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సమాచారం తెలిపే క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన కీ చైన్లను జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్ శుక్రవారం ఆవిష్కరించారు. ఆర్టీసీ డిపోలో ప్రయాణికులతో మర్యాద దినోత్సవాన్ని నిర్వహించారు. కీ చైన్‌కు ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆర్టీసీకి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకోవచ్చని తెలిపారు. బస్సుల బుకింగ్, గమ్యం యాప్ తదితర సేవలను పొందవచ్చని తెలిపారు.


ఆర్టీసీ క్యూఆర్‌కోడ్‌తో రూపొందించిన కీ చైన్లు

ఎగిసిపడిన మంజీరమ్మ



జాతీయ రహదారి పక్కన మిషన్ భగీరథ గ్రిడ్ మెయిన్ పైప్‌లైన్ పగిలి ఎగసిపడుతున్న జలాలు

సదాశివపేట, ఏప్రిల్ 18: (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం పెద్దాపూర్ గ్రామ శివారులో 65వ జాతీయ రహదారిపై మిషన్ భగీరథ గ్రిడ్ మెయిన్ పైప్‌లైన్ పగలడంతో లక్షలాది లీటర్ల శుద్ధ జలాలు రోడ్డు పాలయ్యాయి. వరదలు వచ్చిన స్థాయిలో మంజీర నీరు జాతీయ రహదారిపై పారడంతో వాహనాలు నిలిచిపోయాయి. జరుగుతున్న దేమిటో.? అర్థం కాక వాహదారులు భయాందోళనకు గురయ్యారు. జాతీయ రహదారి విస్తరణ పనులు చేస్తున్న నేపథ్యంలో తరచూ ఈ ప్రాంతంలో మిషన్ భగీరథ మెయిన్ గ్రిడ్ పైప్‌లైన్ పగులుతున్నట్లు తెలుస్తోంది. ఇలా పైప్‌లైన్ పగులుతుండటంతో సదాశివపేట మన్సిపాలిటీలో తరచూ మంచినీటి సరఫరా నిలిచిపోతోంది.

కొత్త పరిశ్రమలకు ఊరట

- సదుపాయాల కల్పన
- 5 కోట్లతో రహదారుల ఏర్పాట్లు చేపట్టిన పరిశ్రమల సమాఖ్య
- జోరుగా నిర్మాణాలు

జిన్నారం, ఏప్రిల్, 18 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పరిష్కారం కాని రహదారుల ఏర్పాటుకు మోడల్ ఇండస్ట్రీయల్ తరఫున 5 కోట్లతో నూతన సీసీ రోడ్ల ఏర్పాటు చేపట్టడంతో ఉపాధి అవకాశాలతో రంగానికి మేలు జరుగుతుంది. ప్రభుత్వ ప్రోత్సాహం, పరిశ్రమల సమాఖ్య సహకారంతో గడ్డపోతారం, కాజీపల్లి పారిశ్రామిక వాడలో నూతన పరిశ్రమ స్థాపన జోరుగా సాగుతోంది.



గడ్డపోతారంలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమ,



కాజీపల్లి పారిశ్రామిక వాడలో ఇటీవల నిర్మించిన సీసీ రహదారి

జోరుగా కొత్త పరిశ్రమల నిర్మాణాలు

జోరుగా కొత్త పరిశ్రమల నిర్మాణాలు మౌలిక వసతులు కొంత కాలంగా చిన్న, మధ్య తరగతి నుంచి భారీ స్థాయి పరిశ్రమల ఏర్పాటు జరుగుతుంది. ఇందులో మూడు పరిశ్రమల యూనిట్లు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. గతంలో టీఎస్ ఐపాస్‌లో స్థలాలు పొందిన కొన్ని సంస్థలు, తమ ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలాల్లో కూడా తమ యూనిట్లను విస్తరిస్తున్నాయి. దీంతో వేల మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయి.

5 కోట్లతో రహదారుల ఏర్పాట్లు



మూర్తి

గడ్డపోతారం, కాజీపల్లి పారిశ్రామిక వాడలో 5 కోట్లతో నూతన సీసీ రహదారుల ఏర్పాటు చేపట్టినట్లు మోడల్ ఇండస్ట్రీయల్ అధ్యక్షులు మూర్తి తెలిపారు. పారిశ్రామిక వాడలోని సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కోసం అసోసియేషన్ తరపున నిరంతరం కృషి చేస్తున్నట్లు మూర్తి తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

తొగుట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన చిక్కుడు స్వామికి ఇద్దరు కుమారులు. గ్రామంలో పోచమ్మ బోనాల పండుగ ఉన్నందున గుడి వద్ద గ్రామస్థులు లైటింగ్ డెకరేషన్ ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి చిక్కుడు స్వామి చిన్న కొడుకు సాయి ప్రణీత్ (12), మరో ఇద్దరు బాలురు పోచమ్మగుడి వద్దకు ఆడుకోవడానికి వెళ్లారు. గుడి ముందు ఉన్న ఇనుప పైపుకు విద్యుత్ సరఫరా కావడంతో సాయిప్రణీత్ చేయి దానికి పొరపాటున తగలడంతో కరెంట్ షాక్ తగిలి కిందపడ్డాడు. అతడిని చుట్టుపక్కల వారు గమనించి చికిత్స కోసం సిద్దిపేట ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతిచెందాడు. తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికాంత్‌రావు తెలిపారు.

సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీ మృతి

కంది, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి సెంట్రల్ జైలులో శుక్రవారం రిమాండ్‌లో ఉన్న ఖైదీ ఒకరు మృతి చెందారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ఇజ్జుల వెంకట్ (39)ను ఈ నెల 3న గంజాయి కేసులో నర్సాపూర్ అబ్కారీ పోలీసులు అరెస్ట్ చేసి సంగారెడ్డి సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు పంపించారు. వెంకట్‌కు గురువారం రాత్రి ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో అక్కడ ఉన్న జైలు వైద్యులు అతడికి ప్రథమ చికిత్స చేశారు. కోలుకున్న వెంకట్‌కు శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు మళ్లీ ఫిట్స్ వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. జైలు వైద్యులు అతడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వెంకట్ గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని సంతోష్‌రాయ్ వెల్లడించారు. మృతదేహాన్ని మార్చురీలో భద్ర పరిచారు. పోస్టుమార్టం రిపోర్ట్ అనంతరం ఖైదీ మృతికి కారణాలు స్పష్టమవుతాయని వైద్యులు తెలిపారు.

మోటార్ సైకిళ్ల చోరీ కేసులో నిందితుల అరెస్ట్



గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌లో నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

గుమ్మడిదల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకొని విచారించగా వివిధ జిల్లాల నుంచి ఏడు బైకులను దొంగతనం చేసినట్లు ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసి నింతితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గుమ్మడిదల పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో జిన్నారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ నయీముద్దీన్ , గుమ్మడిదల ఎస్సై మహేశ్వర్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ గుమ్మడిదల టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ వైపు నుంచి నెంబర్ లేని పల్సర్ బైక్ పైన ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించారు. బైకులు ఆపి విచారించగా అందులో ఒకని పేరు ప్రేమ్ కుమార్, ఎలక్ట్రీషియన్ మియాపూర్ ఏరియా ప్రాంత వాసిగా గుర్తించారు. ఇతనితో పాటు ఇంకో 7 గురు మైనర్లు కలసి గుమ్మడిదల పీస్ పరిధిలో 2 బుల్లెట్ బైక్‌లు, 1 స్కూటీ, దుండిగల్ పీస్ పరిధిలో 2 బైక్ లు, నర్సాపూర్ పీస్ మెదక్ జిల్లా పరిధిలో 1 బైక్, చిట్యాల పీస్ నల్గొండ జిల్లా పరిది లో 1 బైక్ మొత్తం 7 వాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించారు. నిందితుల నుంచి 7 వాహనాలను రికవరీ చేసి వారి వద్ద నుంచి 4 సెల్ ఫోన్‌లను సీజ్ చేసి, నిందితుడిని రిమాండ్‌కి పంపించినట్లు తెలిపారు. ఇట్టి కేసును ఛేదించిన సిబ్బంది కిషోర్, అద్వైత రెడ్డిని డీఎస్పీ అభినందించారు.

ధాన్యం కుప్పలను ఢీకొని వ్యక్తికి గాయాలు



కొండపాక, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలను ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం కొండపాక శివారులో జరిగింది. కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామానికి చెందిన గుర్రాల చంద్రం అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై తిమ్మారెడ్డిపల్లి నుంచి కొండపాకకు వెళ్తుండగా, అదుపుతప్పి రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలపైకి దూసుకుపోయి కింద పడ్డాడు. దీంతో అతడికి తీవ్రమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి

మర్కుక్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మర్కుక్ మండలం చేబర్తి గ్రామంలో జరిగింది. మర్కుక్ ఎస్సై దామోదర్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన ఎలిమెల పోచయ్య(50) అనే రైతు తనకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. తన పొలానికి సమీపంలోనే కొండపోచమ్మ సాగర్ జలాశయానికి సంబంధించిన ప్రధాన కాలువ ఉంది. ఈ కాలువలో విద్యుత్ మోటారును దించి పైపుల ద్వారా వ్యవసాయానికి సంబంధించి సాగునీటిని వాడుకుంటున్నాడు. ఈ క్రమంలో విద్యుత్తు మోటారు పాడయింది. దాని మరమ్మతులు చేసేందుకు కాలువలోకి దిగాడు. అదే సమయంలో మోటారుకు విద్యుత్తు సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. తన పోచయ్య భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పుల్‌కల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ ఆస్పత్రిలో మరణించింది. పుల్‌కల్ ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టేక్మాల్ మండలం ఎల్పుగొండ గ్రామానికి చెందిన యాదగిరి ఈ నెల 14న తన తల్లి సత్తమ్మ, చెల్లెలు నర్సమ్మలను టీఎస్35టీ 5215 నంబరు గల ఆటోలో ఎక్కించుకుని స్వగ్రామం నుంచి పటాన్‌చెరు మండలం చిట్కుల్ వెళ్తున్నాడు. చౌటకూర్ గ్రామ శివారులోని 161 జాతీయ రహదారిపై గల ఫ్లై ఓవర్ వంతెనపై ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో సత్తమ్మ తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తీసుకెళ్లారు. సత్తమ్మ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ఈ మేరకు ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీ, కుమారుడు అదృశ్యం



అదృశ్యమైన తల్లి, కుమారుడు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన ముక్కెర లావణ్య కనిపించడంలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. దౌలాపూర్ గ్రామానికి చెందిన పోచమ్మ మల్లయ్య దంపతుల కుమార్తె ముక్కర లావణ్యకు గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన వేముల కృష్ణతో పది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఆమె పది నెలలుగా తల్లిగారి నివాసమైన దౌలాపూర్‌లో తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. లావణ్య, తన కుమారుడు గురువారం రాత్రి నుంచి కనిపించడంలేదు. వారు కనిపించకుండా పోవడంతో వారి తల్లిదండ్రులు శుక్రవారం జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బైక్‌ల దొంగలు అరెస్ట్



బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

జహీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలను దొంగలిస్తున్న నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపించినట్లు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు కేసు వివరాలు వెల్లడించారు. జహీరాబాద్‌కు చెందిన మహ్మద్‌అల్తాఫ్, 16సంవత్సరాలున్న బాలుడు కలిసి పట్టణం నుంచి పల్సర్(టీఎస్15-ఈటీ3826), యాక్టీవా(టీఎస్12-ఈకే2859) ద్విచక్రవాహనాలపై జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుండగా ట్రాఫిక్‌సిగ్నల్స్ వద్ద వారిని ఆపి తనఖీలుచేసి విచారించగా బైకుల దొంగలని తేల్చారు. వీరు గతేడాది కాలంగా దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. దొంగతనాలు చేస్తున్నప్పుడు ఎవరైనా అడ్డగిస్తే వారివెంట ఉంచుకున్న చాకులు, కమ్మకత్తులతో దాడులు చేయడం, అవసరమైతే ప్రాణాలను తీసేవారన్నారు. వారి వద్ద ఉన్న మారణాయుధాలు, 8 బైక్‌లను స్వాధీనం చేసుకుని అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈఘటనను చేధించిన పోలీసులను ఆయన అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామచంద్రాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం ఉదయం ఓ గుర్తుతెలియని(45-50) వ్యక్తి రేడియల్ రోడ్డు 7 ఎక్స్టెన్సన్ దాటుతుండగా అతివేగంగా వచ్చిన వాహనం ఢీ కొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు కొల్లూరు పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు.

ఎద్దుకు మత్తు మందు ఇచ్చి చోరీ



స్పృహ కోల్పోయిన ఎద్దు

కొండాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుంతపల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు ఎడ్లకు మత్తు మందు ఇచ్చి ఎద్దును ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. గుంతపల్లి గ్రామానికి చెందిన మందుల రాంచంద్రయ్య ఊరికి పక్కన ఉన్న తన కొట్టం(గుడిసె)లో రెండు ఎద్దులను గురువారం సాయంత్రం కట్టేసి ఉంచాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కట్టేసి ఉంచిన ఎద్దులకు మత్తు మందు ఇచ్చి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. మత్తు మందు ఇవ్వడంతో ఒక ఎద్దు అక్కడే స్పృహ కోల్పోవడంతో ఒక ఎద్దును ఎత్తుకెళ్లినట్లు, స్పృహ కోల్పోయి పడిన ఎద్దును పశువుల డాక్టర్‌తో వైద్యం చేయించి పోలీసులకు సమాచారం అందించినట్లు బాధిత రైతు రాంచంద్రయ్య తెలిపారు.

కరెంట్ షాక్‌తో గొర్రెల కాపరి మృతి



క్యాసారం దాసు (ఫైల్)

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్‌తో గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని చందంపేట గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబీకుల వివరాల మేరకు గ్రామానికి చెందిన క్యాసారం దాసు (30) అదే గ్రామానికి చెందిన గొల్ల మల్లయ్య వద్ద గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. గొర్రెలను పేత కోసం చందంపేట గ్రామ శివారులోకి తోలుకెళ్లాడు. వేసవి కాలం కావడంతో దాసుకు దాహం వేసింది. నీళ్లు తాగేందుకు ఓ బారుబావి వద్దకు వెళ్లి మోటార్ స్టాటర్ స్విచ్ ఆన్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతినికి భార్యా నాగలక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుని భార్యా శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

న్యాల్‌కల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగ్వార్‌శివారులో శుక్రవారం 45 సంవత్సరాలున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిందని హద్నూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గంగ్వార్‌శివారులో ఒకరు ద్విచక్రవాహనంపై నుంచి పడిపోయి మృతిచెంది ఉన్నాడని సమాచారం అందింది. మృతుడికి సంబంధించిన వారెవరైనా ఉంటే 8712656769, 8712661850, 8978289929 నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి పంపించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.


రోడ్డుపై గుంతలు పూడ్చివేత

శివ్వంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన శివ్వంటలోని పెద్ద చెరువు కట్టపై రోడ్డు భారీగా గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతుండడంతో శుక్రవారం మాజీ జెడ్పీటీసి మహేష్ గుప్తా సహకారంతో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ వెంకటేష్‌లు గుంతలను పూడ్చివేశారు.

భక్తులకు నీడనిచ్చే పందిరి ఏర్పాటుకు అడ్డంకులు

కొల్చారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయలకు వెళ్లే భక్తులకు నీడ కోసం మండలంలోని పోతంశెట్టిపల్లి శివారులో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక పందిరిని స్థానికులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గురువారం ఆంధ్రజ్యోతిలో 'బస్సు వచ్చే దాకా ఎండలోనే..' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఏడుపాయలకు వెళ్లే బస్సుల కోసం ఎదురుచూసే చోట తాత్కాలిక చలువ పందిరిని ఏర్పాటు చేసేందుకు మెదక్ ఆర్టీసీ డీఎం సురేఖ చొరవ చూపారు. శుక్రవారం ఆర్టీసీ సిబ్బంది సంగమేశ్వర్‌తో ఆమె అక్కడికి చేరుకుని పందిరి నిర్మించాలని సిబ్బందికి సూచించారు. కర్రలు, తడకలు కూడా అక్కడికి చేరుకున్నాయి. అయితే, స్థానికంగా ఉండే కొంతమంది బస్టాండ్ ఏర్పాటు చేస్తే మా స్థలాలకు ఇబ్బందులు ఉంటాయని అడ్డుకున్నారు. భక్తుల కోసం చూస్తే తమ ప్లాట్లకు నష్టం వాటిల్లుతుందని, ఇక్కడ ఎలాంటి షెడ్డు వేయొద్దని కోరారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుతిరిగి వెళ్లిపోయారు.

సీఎం, మంత్రుల దృష్టికి రేడియల్ రోడ్డు సమస్యలు



ఎక్స్‌లో చేసిన పోస్ట్

రామచంద్రాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : తెల్లపూర్‌లో రేడియల్ రోడ్డు సమస్యలను సీఎం, మంత్రుల దృష్టికి వెళ్లాయి. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రమాదకరంగా రేడియల్‌రోడ్డు ఎక్స్‌టెన్షన్-30' కథనంపై స్థానికంగా చర్చసాగింది. ఇక్కడి అసోసియేషన్ల అధ్యక్షుడు రమణ సోషల్‌మీడియా 'ఎక్స్' ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ క్రాంతికు ఎక్స్‌లో టాగ్ చేశారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన క్లిపింగ్‌తో పాటు రోడ్డుకు సంబంధించిన మరిన్ని సమస్యలు పొందుపర్చారు. వేల సంఖ్యలో ప్రజలు ఎక్స్‌లో వీక్షించడంతో పాటు కామెంట్స్ చేశారు.



జహీరాబాద్‌లో కుట్టు పనిలో శిక్షణ పొందిన మహిళలకు అందజేసిన కుట్టు మిషన్‌లు(ఫైల్)

మహిళలకు చేయూత

ఉపాధికి ఊతమిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాలు

ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ

కోల్‌ఇండియా సౌజన్యంతో వివేకానంద ఇనిస్టిట్యూట్ కార్యక్రమం

జహీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పలు సంస్థలు మహిళల ఉపాధికి ఊతమందిస్తున్నాయి. ఆర్థికంగా చేయూతనందించేందుకు తమ వంతు సహాయాన్ని చేస్తున్నాయి. కొన్ని సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిరుపేదల అభ్యున్నతికి తోడ్పాడుతున్నాయి. ఆయా రంగాల్లో మెలకువలను నేర్పుతూ శిక్షణనిస్తున్నాయి. అలాంటి సంస్థల్లో కోల్ ఇండియా ఒకటి. కోల్‌ఇండియా సౌజన్యంతో వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను అందించడమే కాకుండా కుట్టులో మెలకువలను నేర్పిస్తున్నారు.



మహిళలకు కుట్టు మిషన్లను అందజేస్తున్న ప్రముఖులు(ఫైల్)

600 కుట్టు మిషన్‌లు అందజేత

జహీరాబాద్ నియోజకవర్గంలో కోల్‌ఇండియా వారు ఇప్పటి వరకు 600 కుట్టు మిషన్‌లను అందజేశారు. త్వరలో మరో 250 వరకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో కుట్టులో మెలకువలను నేర్పించేందుకు మహిళలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి, మిర్జాపూర్‌తో పాటుగా జహీరాబాద్ పట్టణంలో నాలుగు చొప్పున మొత్తం ఎనిమిది శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో 250 మంది మహిళలకు కుట్టు పనుల్లో తర్ఫీదు ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరు నెలలుగా ఇస్తున్న కుట్టు శిక్షణ నిరుపేద మహిళల జీవనోపాధికి ఎంతగానో దోహదపడుతున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ శిక్షణతో మహిళలు తాము స్వశక్తితో ఎదుగుతామనే ధీమా కల్పిస్తున్నారు.

మహిళల్లో ధైర్యాన్ని నింపుతున్నాం



మహిళలకు కుట్టులో శిక్షణనిచ్చి, వారు స్వశక్తితో బతుకగలమనే ధైర్యాన్ని నింపుతున్నాం. ఆర్థికంగా ఎదిగేందుకు సహకరిస్తున్నాం. కుట్టు పనిని నేర్పించి, కుట్టు మిషన్లను అందజేస్తే నిరుపేద మహిళలను ఆదుకున్న వారమవుతామని సంస్థ దృష్టికి తీసుకెళ్లాం. ఈ యూనిట్‌ను జహీరాబాద్‌కు తీసుకురావడంలో నావంతు బాధ్యతగా కృషిచేశా.

-కె.లక్ష్మారెడ్డి, ఆల్‌ఇండియా కోల్‌సెక్టార్ ఇన్‌చార్జి

స్వశక్తితో ఎదిగేందుకు కష్టపడాలి



మారుతున్న కాలానుగుణంగా సమాజంలో మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు కష్టపడాలి. నేను ఇప్పటివరకు 150 మందికి కుట్టు పనుల్లో శిక్షణనందిస్తున్నా. జహీరాబాద్ పట్టణంలోని మాణిక్ ప్రభు మందిరంలో శిక్షణనిస్తున్నాం. ఒక్కో బ్యాచ్‌లో 30 మంది మహిళలు ఉన్నారు. అన్ని రకాల దుస్తులు కుట్టేలా మెలకువలను నేర్పిస్తున్నాం.

- దేశెట్టి కవిత, ట్రైనర్

కుట్టు పనులు ఎంతో దోహదపడతాయి



కోల్‌ఇండియా, వివేకానంద ఇనిస్టిట్యూట్ వారు నేర్పిస్తున్న కుట్టు పనులు మాలాంటి నిరుపేదలకు ఎంతో దోహద పడుతాయి. ఇంట్లో కుట్టు మిషన్ ఉంటే ఇతరత్రా పనులను చేసుకుంటు ఖాళీ సమయాల్లో అదనంగా ఆదాయం సంపాదించ డానికి ఉపయోగపడుతుంది. ఇలాంటి పథకాలతో జీవనోపాధి దొరుకుతుంది.

- తూంకుంట జయమ్మ, జహీరాబాద్

ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- రేపటి నుంచి 26 వరకు పరీక్షల నిర్వహణ
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

సంగారెడ్డి అర్బన్/సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 20వ తేదీ నుంచి 26 వరకు నిర్వహించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో పదో తరగతికి తొమ్మిది కేంద్రాలు, ఇంటర్మీడియట్‌కు 15 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లాలో పదో తరగతికి నాలుగు కేంద్రాలు, ఇంటర్మీడియట్‌కు ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. సంగారెడ్డి జిల్లాలో పరీక్షల నిర్వహణకు ఆరు స్టోరేజ్ పాయింట్లు, 24 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 24 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 24 మంది జాయింట్ కస్టోడియన్లు, 379 మంది ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ మూడు బృందాలు, డీఆర్డీసీ రెండు కమిటీలను నియమించారు. జిల్లా వ్యాప్తంగా టెన్త్ 2,195 మంది, ఇంటర్ 4,334 మంది మొత్తం 6,529 మంది పరీక్షలు రాయనున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ అధికారులను నియమించనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనున్నది. సందేహాల కోసం కంట్రోల్ రూమ్ 08455-276434, లేదా ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబరును సంప్రదించాలని అధికారులు కోరారు.

రెగ్యులర్ మాదిరిగానే ఓపెన్ పరీక్షలు



- ఎస్.వెంకటేశ్వర్లు, సంగారెడ్డి డీఈవో

రెగ్యులర్ మాదిరిగానే ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం. అభ్యర్థులందరూ పరీక్షా సమయం కంటే గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. ఎలాంటి నిషేధిత మెటీరియల్స్ కేంద్రాల్లోకి అనుమతి లేదు. పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకే లోనికి అనుమతిస్తాం. కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సంబంధిత కేంద్రం బాధ్యులపై శాఖపరమైన చర్యలు ఉంటాయి. రెగ్యులర్ పరీక్షల తరహాలోనే ఓపెన్ పరీక్షలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

- బి.అనురాధ, సిద్దిపేట సీపీ



ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల కోసం పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశాం. రేపటి నుంచి పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్ష కేంద్రాల నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దు. పరీక్ష సమయంలో కేంద్రాల వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తాం. విద్యార్థులు పరీక్షా సమయానికే గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి. మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

కోతల జోరు.. ఖర్చుతో బేజారు

అకాల వర్షాలతో హార్వెస్టర్‌కు పెరిగిన డిమాండ్

కొల్చారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ఊపందుకున్నాయి. ఈదురుగాలులతో కూడి వడగండ్ల వానలు బీభత్సం సృష్టిస్తుండడంతో రైతులు భయంతో పంట కోతకు తొందర పడుతున్నారు. దీంతో హార్వెస్టర్ యంత్రాలకు డిమాండ్ పెరిగింది. రేటు మాట్లాడుకుని ముందుగా బుకింగ్ చేసుకున్నప్పటికీ హార్వెస్టర్ యజమానులు ఏదో కారణం చెబుతూ రావడం లేదు. ఎక్కడ ఎక్కువ డబ్బు ఇస్తే అక్కడికి కోత యంత్రాలను పంపిస్తున్నారు. రైతులు ఏంచేయలేక చెప్పిన ధర చెల్లించాల్సి వస్తున్నది. మంజీరా పరీవాహక ప్రాంతమైన కొల్చారం మండలంలోని యనగండ్ల, మాందాపూర్, కోనాపూర్, రంగంపేట, సంగాయపేట, చిన్నఘనపూర్, పోతంశెట్టిపల్లి గ్రామాల్లో ఎక్కడ చూసిన పొలాల్లో హార్వెస్టర్లతో వరి కోతల దశ్యాలే కనిపిస్తున్నాయి. టైర్ హార్వెస్టర్‌కు గంటకు రూ.2500, చైన్ హార్వెస్టర్ యంత్రానికి రూ.3000 వరకు తీసుకుంటున్నారు. ఎకరాకు గంటన్నర చొప్పున యంత్రానికి రూ.4500 ఖర్చయిందని పోతంశెట్టిపల్లి రైతు పున్నయ్య తెలిపారు. ఇంత ఖర్చు పెట్టినా గతం కంటే దిగుబడి అంతంతమాత్రమే ఉందని రైతు వాపోయాడు.



కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి వద్ద వరి పంట కోస్తున్న చైన్ హార్వెస్టర్ యంత్రం

పశుగ్రాసం.. తెచ్చేసుకుందాం

మద్దూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా పాడి రైతులు పశుగ్రాసానికి ముందస్తుగానే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వరి కోతలు ముమ్మరంగా సాగుతుండడంతో మేత కోసం గడ్డిని సేకరిస్తున్నారు. కోతల అనంతరం కొంతమంది ఈ గడ్డిని ఉచితంగా ఇస్తుండగా, మరికొంత మంది ఎంతోకొంతకు విక్రయిస్తున్నారు. ఈ గడ్డిని తీసుకున్న పశుపోషకులు బేలర్ మిషన్లతో కట్టలు కట్టిస్తూ తరలిస్తున్నారు.





మద్దూరు మండలం లద్నూరులో ట్రాక్టర్‌పై గడ్డిని తరలించి పశువులపాక వద్ద వాము పెట్టుకున్న పాడి రైతు, లద్నూరులో ఓ పొలంలో గడ్డి కట్టలు



సిద్దిపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని శుక్రవారం ఉమ్మడి జిల్లాలో ముస్లింలు కదం తొక్కారు. నారాయణఖేడ్, జోగిపేట, సిద్దిపేట, గజ్వేల్‌తో పాటు పలు చోట శాంతియుతంగా భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు

వక్ఫ్ సవరణ వద్దు

ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ... ప్లకార్డులతో నిరసన

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ చట్టం రద్దు అయ్యే వరకు వెనకడుగు వేసేది లేదని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ నాయకులు, సిద్దిపేట తంజీమ్ అధ్యక్షుడు ఏజాజ్ హఫీజ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో శాంతియుత ర్యాలీని నిర్వహించారు. బస్‌స్టాండ్ నుంచి విక్టరీ చౌరస్తా మీదుగా ఇక్బాల్ మినార్ వరకు కొనసాగింది. ర్యాలీ అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ముస్లింలను ఇబ్బంది పెడుతుందని ఆరోపించారు. ముస్లింల అస్తిత్వాన్ని దెబ్బ తీసేలా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బిల్లు వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జమైతే ఉలేమా అధ్యక్షుడు ముఫ్తీ సలాం, వివిధ సంస్థల పెద్దలు, యువత పాల్గొన్నారు. సిద్దిపేటలోని నసీర్‌నగర్ వాసులు సొసైటీ సభ్యులతో కలిసి ప్లకార్డులను ప్రదర్శించి నిరసన తెలిపారు.



జోగిపేటలో బైఠాయించిన ముస్లింలు

బిల్లును ఉపసంహరించుకోవాలి

గజ్వేల్/చేర్యాల/మిరుదొడ్డి/నారాయణఖేడ్/జోగిపేట రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి మద్దతు ప్రకటించారు. వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకునే వరకు పోరాటం ఆగదని తన్జీముల్ మసాజిద్ కమిటీ చైర్మన్ సయ్యద్ మతీన్ అన్నారు. చేర్యాలలో స్థానిక చావడి నుంచి మసీదు వరకు ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు. దుబ్బాకలో ర్యాలీకి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భాస్కర్ మద్దతు తెలిపారు. మిరుదొడ్డి మండలంలోని అల్వాల్‌లో నిరసన వ్యక్తం చేశారు. జోగిపేటలో స్థానిక మదీనా మసీద్‌లో చేతులకు నల్ల రిబ్బన్ పట్టీలు ధరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మసీదు నుంచి ర్యాలీగా అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ సత్తయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు.

వైభవంగా బేతాళస్వామి జాతర

పోటాపోటీగా ఎడ్ల బండ్ల ప్రదర్శన.. భక్తులతో కిటకిటలాడిన ఆలయం

అల్లాదుర్గం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అల్లాదుర్గం బేతాళస్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఎక్కడా లేనివిధంగా అల్లాదుర్గంలో బేతాళుడి ఆలయం ఉండటంతో రాష్ట్రంతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు ఇలవేల్పుగా కొలుస్తుంటారు. ఆలయంలో ఏటా మూడు రోజులు జాతర నిర్వహిస్తుంటారు. ఉమ్మడి జిల్లాలో ఏడుపాయల జాతర తర్వాత ఇక్కడి జాతర ప్రసిద్ధిగాంచింది. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదక్షిణ నిర్వహించారు. బండ్లను ప్రదర్శించేందుకు భక్తులు పోటీపడ్డారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భక్తులు వివిధ రకాలుగా అలంకరించిన ఎడ్లబండ్లను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగాణం కిటకిటలాడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.





జాతరలో ఎడ్లబండ్లను ప్రదర్శన, ఇన్‌సెట్‌లో ఆలయంలో కొలువుదీరిన బేతాళస్వామి



అశేష భక్తజనం మధ్య కొనసాగుతున్న సిద్దేశ్వరుని రథోత్సవం

కన్నులపండుగగా సిద్ధేశ్వర రథోత్సవం



అగ్ని గుండం ప్రవేశం

కంగ్టి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కంగ్టిలోని సిద్ధేశ్వరుని రథోత్సవం శుక్రవారం సాయంత్రం అశేషభక్తుల మధ్య కన్నులపండుగగా కొనసాగింది. వేకువ జామున ఉత్సవమూర్తుల ఊరేగింపు చేపట్టిన అనంతరం స్వామి వారి రథం ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో నడుస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కట్టెలతో ముప్పై అడుగుల ఎత్తుతో ప్రత్యేకంగా తయారు చేసిన రథాన్ని గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయం వరకు భక్తులు తాళ్లతో లాగారు. రథం ఊరేగింపు వ్యవసాయ పొలాల గుండా కొనసాగింది. దారి పొడవునా హరహర మహదేవ్ అంటూ మార్మోగింది. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సీతారామచంద్రస్వామి పునఃప్రతిష్ఠకు మాజీ ఉపరాష్ట్రపతికి ఆహ్వానం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలో ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్న శ్రీసీతారామచంద్రస్వామి పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడును ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నివాసానికి శుక్రవారం ఉదయం వెళ్లిన రామాలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా శాలువాలతో సన్మానం చేశారు. కనకరాజు వెంట ఆలయ కమిటీ బాధ్యులు ఉన్నారు.



వెంకయ్య నాయుడుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కనకరాజు

విగ్రహాల ఏర్పాటు విషయమై ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత

కొల్చారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్, శావాజీ విగ్రహాల ఏర్పాటు విషయమై ఇరు వర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొల్చారం మండల కేంద్రంలో ఈ నెల 14 న అంబేద్కర్ జయంతి సందర్భంగా రాత్రిపూట గద్దె ఏర్పాటు చేసి విగ్రహం ఏర్పాటు చేశారు. 15న యువజన సంఘాల సభ్యులు చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు కోసం భూమి పూజ చేశారు. శుక్రవారం శివాజీ విగ్రహం ఏర్పాటు కోసం గుంతను తవ్వడంతో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు జై భీమ్ నినాదాలు చేస్తూ అక్కడికి చేరుకోవడంతో రెండు వర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానిక ఎస్ఐ ఎంత చెప్పినా వినకపోవడంతో పోలీస్ బలగాలను రప్పించి వారిని చెదరగొట్టారు. డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ రాజశేఖర్ రెడ్డి ఘటనా స్థలానికి పరిశీలించారు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. రోడ్డు మధ్యలో విగ్రహాల ఏర్పాటుతో గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు జరుగుతున్నాయని, అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బీజేపీలో చేరిన నాయకులు



పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి సమక్షంలో చేరుతున్న నేతలు

రామచంద్రాపురం టౌన్ ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కంది మండలం ఎద్దుమైలారం గ్రామానికి చెందిన వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బీజేపీలో చేరారు. రామచంద్రాపురంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, దేశ్‌పాండే, ముత్తిరెడ్డి, పోచారం రాములు, రామకృష్ణ, ప్రవీణ్‌యాదవ్, నరేన్‌దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అగ్నిగుండాలు



అగ్నిగుండం తొక్కి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రాయికోడ్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాయికోడ్‌లోని భద్రకాళి సమేత వీరభద్రేశ్వర జాతరలో భాగంగా రెండో రోజు, శుక్రవారం స్వామి వారికి అభిషేకం, పల్లకీ సేవ, కల్యాణోత్సవం, అగ్నిగుండం తొక్కుట, రథోత్సవ తదితర కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వీరభద్రేశ్వర యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ముమ్మాదేవి 19వ వార్షికోత్సవాన్ని ఆలయ అర్చకులు సందీప్‌కుమార్ జ్యోసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

● నారాయణఖేడ్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటాపూర్‌లో గంగామాత ఆలయ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను శోభాయాత్రగా తీసుకెళ్లి సమర్పించారు. దారి పొడవునా పోతురాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నల్ల పోచమ్మనాటక ప్రదర్శనను నిర్వహించారు.

30 గంటలు నిలిచిన విద్యుత్ సరఫరా


● తాగునీటికి తల్లడిల్లిన గ్రామస్థులు



జనరేటర్‌తో ఏర్పాటుచేసిన బోరు వద్ద గుమిగూడిన గ్రామస్థులు

కోహీర్, ఏప్రిల్ 18: (ఆంధ్రజ్యోతి) కోహీర్ మండలంలోని చింతల ఘట్టు గ్రామంలో తాగునీటికి తీవ్ర ఇబ్బంది నెలకొంది. గురువారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ స్తంభాల వైర్లు తెగిపోవడం గ్రామానికి 30 గంటల పాటు కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీటి సరఫరా లేకపోవడంతో గ్రామస్థులు తల్లడిల్లారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరినా అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సొంత డబ్బులతో జనరేటర్‌ను ఏర్పాటు చేసి గ్రామస్థులకు తాగునీటిని అందించారు. అధికారులు స్పందించి కరెంటు సరఫరాను పునరుద్ధరించి తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రావు

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మెదక్ మండల పరిధిలోని రాజిపల్లి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వడ్ల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ చౌదరి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● పుల్‌కల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలోని చక్రియాల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆత్మ కమిటీ చైర్మన్ టి.మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నత్తి దశరత్‌లు ప్రారంభించారు. అనంతరం గ్రామస్థులు వారిని శాలువాలతో సత్కరించారు.

సమర్థవంతంగా నిర్వహించాలి

నిజాంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిజాంపేట మండలం వెంకటాపూర్ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఆదమరిస్తే అంతే!

● కల్వర్టుపై నో రెయిలింగ్.. పొంచిన ఉన్న ప్రమాదం



జిన్నారం, ఏప్రిల్,18 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం కాజీపల్లి వద్ద ఏడాది క్రితం సీసీ రోడ్డును విస్తరించారు. ఇందులో భాగంగా జిల్లెలవాగు కల్వర్టుపైనా పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించినా రెండు వైపులా రెయిలింగ్ ఏర్పాటు చేయడం మాత్రం విస్మరించారు. దీంతో రోడ్డుకు ఐదు అడుగుల లోతు ఉన్న వాగుపై ఒకే సారి రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. అంతేకాకుండా వాహనదారులు ఏమాత్రం ఆదమరించినా ప్రమాదాలబారిన పడక తప్పదు. ప్రమాదాలు చోటుచేసుకోకముందే అధికారులు స్పందించి రెండు వైపులా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'భూ భారతి'తో భూ తగాదాలకు స్వస్తి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



అల్లాదుర్గం మండలం చేవెళ్లలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

అల్లాదుర్గం,ఏప్రిల్ 18. (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టం- 2025తో భూ తగాదాలకు చెక్ పడడంతోపాటు భూ సమస్యల శాశ్వత పరిష్కారం లభించనుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం అల్లాదుర్గం మండలం చేవెళ్ల గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి ఆర్‌వోఆర్ చట్టంపై రైతుల అవగాహన సదస్సులో ఆయన అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలపై గతంలో కోర్టులను ఆశ్రయించేవారని, ఈ చట్టం ద్వారా రూ.5లక్షలలోపు విలువ కలిగిన భూములకు సంబంధించి ఆర్డీవో స్థాయిలో, ఆ పైబడి విలువగల భూముల సమస్యలను కలెక్టర్ స్థాయి అధికారుల ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. అర్జీలు పెట్టుకున్న నాటి నుంచి ఏడాదిలో వీటి పరిష్కారం లభిస్తుందని, కానిపక్షంలో సీసీఎల్ఏకు ఫిర్యాదు చేసుకోవచ్చునని తెలిపారు. భూ భారతిలో ఎలాంటి లోపాలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్ మల్లయ్య, మండల ప్రత్యేక అధికారి కరుణాకర్, ఏవో రాజేష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు సుభాష్‌రావు దేశ్‌పాండే, బాలకిషన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యంతో భోజనం...

రేషన్ బియ్యం (సన్న బియ్యం) భోజనాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో రమాదేవి రుచి చూశారు. అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్‌లో శుక్రవారం ఓ ఇంట్లో భోజనం చేశారు.

రామాయంపేటలో..

రామాయంపేట్ ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ధరణితో పేద రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆరోపించారు. రామాయంపేటలో శుక్రవారం నిర్వహించిన భూభారతి సదస్సులో కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్డీవో రమాదేవితో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. తహసీల్దార్ రజని, ఎంపీడీవో సాజలుద్దీన్, ఏవో రాజ్ నారాయణ, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్ రామచంద్రగౌడ్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

చేగుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నార్సింగి మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే నార్సింగిలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం విక్రయించాలన్నారు. వేసవి దృష్ట్యా ప్రజలను నీటి వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. అధికారులు లీకేజీలను అరికట్టి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ షేక్‌కరీం, ఎంపీడీవో ఆనంద్ కుమార్, సొసైటీ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, సొసైటీ సీఈవో నరసింహులు, మాజీ ఎంపీపీ సబిత, మాజీ జడ్పీటీసీ కృష్ణారెడ్డి, చేగుంట మాజీ వైస్ చైర్మన్ ఆకుల మల్లేశం గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్ పోస్టర్ విడుదల

ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా నార్సింగి మండలంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

బీఆర్ఎస్ సభను జయప్రదం చేద్దాం

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



వాల్ పెయింటింగ్ వేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. చలో వరంగల్ కార్యక్రమానికి సంబంధించి సంగారెడ్డిలో శుక్రవారం జై కేసీఆర్.. చలో వరంగల్ అనే వాల్ పెయింటింగ్‌ను ఆయన వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ వాల్ పోస్టర్లు అంటించాలని సూచించారు. స్వచ్ఛందంగా కేసీఆర్ బహిరంగ సభకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మదుసూదన్ రెడ్డి, నాయకులు శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

● తూప్రాన్ ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్తలు లక్షలాదిగా తరలి వచ్చి బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి , ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తూప్రాన్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో వారు సన్నాహక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్లను విడుదల చేశారు.

అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి

జహీరాబాద్,ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : అగ్నిప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకశాఖ అధికారులు శ్రీనివాస్ పేర్కొన్నారు. అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని బూచనెల్లి గ్రామశివారులోని పలు పరిశ్రమల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు అనుసరించే విధానాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిప్రమాపక కేంద్రానికి, పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. స్వల్ప ఘటనలు చోటుచేసుకుంటే తీసుకోవాల్సిన చర్యలను కార్మికులకు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల అర్హులను గుర్తించాలి

● సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

కొండాపూర్, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ జాబితాలలో అర్హులను గుర్తించి పనులను వేగవతం చేయాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులకు సూచించారు. శుక్రవారం మల్లేపల్లి, అలియాబాద్, మల్కాపూర్ గ్రామాలలో స్పెషల్ ఆఫీసర్లు కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. మల్కాపూర్ సమావేశానికి ఆయన హాజరై సభ్యులకు పలు సూచనలు చేశారు. జాబితాలో పక్కా ఇల్లు లేని వారిని గుర్తించి ఇంటి నిర్మాణ పనులు మొదలుపెట్టేలా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. అవకతవకలకు తావులేకుండా గ్రామా ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలని అదేశించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులు, వసతులపై ఆరా తీశారు. ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, రఘువీర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



పంట నష్టంపై ఏఈవోను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి


శివ్వంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని లింగోజిగూడ, పిల్లుట్ల, కొత్తపేట గ్రామాల్లో వర్షానికి నష్టం వాటిల్లిన పంట పొలాలను ఆమె శుక్రవారం పరిశీలించి రైతులను పరామర్శించారు. ఆమె వెంట ఆర్ఐ కిషన్, ఏఈవో మౌనిక, నాయకులు మన్సూర్ రమణ గౌడ్ మాజీ సర్పంచ్ రవి, చింత స్వామి తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొల్చారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దళారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దని ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. శుక్రవారం కొల్చారం మండల పరిధిలోని చిన్న ఘనపూర్ ప్రాథమిక సహకార సంఘం వద్ద కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మంద నాగులు, ఉపాధ్యక్షుడు రాజు, మధుసూదన్‌రెడ్డి, బాగా రెడ్డి, వీరారెడ్డి, శంకర్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన వడగళ్ల వానకు 70 ఎకరాలు 120 మంది రైతుల వరి పంటలు దెబ్బతిన్నాయి. శుక్రవారం మండల వ్యవసాయాధికారి లక్ష్మిప్రవీణ్ శాలిపేట గ్రామాన్ని సందర్శించి పంటలను పరిశీలించారు. నష్టపోయిన వరి పంట వివరాలు నమోదు చేసుకున్నారు. వివరాలను పైఅధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. మాజీ సర్పంచ్ పోచయ్య, ఏఈవోలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి శివారులోని రాక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ యేసుపాల్

రామచంద్రాపురం /కోహీర్/పెద్దశంకరంపేట/ చిన్న శంకరంపేట/సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురంలోని తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని చర్చీల్లో శుక్రవారం శుభ గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. యేసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను ఆయా సంఘాల పాస్టర్లు, కొందరు సంఘపెద్దలు వివరించారు. మూడు గంటల సమయంలో క్రీస్తు సిలువపై ప్రాణాలు విడిచారని విశ్వసించే క్రైస్తవ సోదరులు ఆరాధనను ముగించారు. ఉదయం నుంచి ఉపవాసంలో ఉన్న వారు ఆయా చర్చీల ఆవరణలో అందించిన పళ్ల రసాలు, మజ్జిగను సేవించి ఉపవాసం విడిచారు. కొల్లూరు, తెల్లాపూర్ మెథడిస్ట్ చర్చిలలో పాస్టర్లు రెవరెండ్ నెల్సన్, రెవ. వరప్రసాదులు ప్రత్యేక ఆరాధనలు జరిపారు. పెద్దశంకరపేటలోని సీఎస్ఐ చర్చిలో, చిన్నశంకరంపేట మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోహీర్ మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు మండల పరిధిలోని బిలాల్‌పూర్, మనియార్‌పల్లి, బడంపేట, పర్శపల్లి, సజ్జాపూర్, పీచేర్యాగడి, రాజనెల్లి, గురుజువాడ, మద్రి, దిగ్వాల్, కవేలి, చింతల ఘట్టు, వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి పైడిగుమ్మల్ తదితతర గ్రామాల్లో శుక్రవారం క్రైస్తవ సోదరులు ఘనంగా గుడ్‌ఫ్రైడే ను జరుపుకున్నారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులోని రాక్ చర్చిలో పాస్టర్ యేసుపాల్ అధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఎండిన మడి.. రైతు కంట తడి

(5వ పేజీ తరువాయి)

సమాచారం ఇవ్వలేదు. కనీసం పత్రికల్లోనూ ఈ విషయంపై ప్రకటన చేయలేదు. దీంతో, ప్రతీసారి మాదిరిగానే రైతులు యథావిధిగా యాసంగిలో చెరువులు, కుంటల్లో నీరు నిండుతుందనే ధీమాతో బోర్ల ఆధారంగా వరి నాట్లు వేశారు. అందోలు మండలంలోని 15,232 ఎకరాలు, పుల్కల్ మండలంలో 10వేల ఎకరాలు, చౌటకూరు మండలంలో 8,002 ఎకరాల్లో వరి సాగు చేశారు. నిన్నమొన్నటి వరకు బోర్లు, చెరువుల ఆధారంగా నీటి తడులను అందించారు. ఎండలు ముదరడంతో చెరువులు, కుంటలు అడుగంటాయి. బోర్లలో నీరు తగ్గింది. బొట్టుబొట్టుగా నీరు పోసే బోర్లను పొద్దంతా నడిపినా పది గుంటల పొలమైనా తడవడం లేదు. దీంతో, పొట్ట దశలో ఉన్న వరికి నీటి తడి అందక ఎండిపోతున్నది. వేలది ఎకరాల్లో పొలాలు నెర్రెలుబారుతున్నాయి. పంటను కాపాడుకోవడానికి రైతులు భగీరథ ప్రయత్నం చేసినా ఎండల తీవ్రత కారణంగా ఫలితం ఉండటం లేదు. అటు కాల్వల ద్వారా నీటి సరఫరా లేక, ఇటు బోర్లు నీరు పోయక ఇప్పటికే నాలుగు వేల ఎకరాల్లో పొలాలు ఎండిపోయాయి. అందోలు మండలంలో



వెయ్యి ఎకరాలు, పుల్కల్, చౌటకూరు మండలాల్లో 3వేల ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. పంటపై ఆశలు వదిలేసుకున్న రైతులు మనసు చంపుకుని పొలాల్లో పశువులను మేతకు వదులుతున్నారు.

యువకుడు అదృశ్యం



నరేష్ (ఫైల్)

మునిపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : యువకుడు అదృశ్యమైన సంఘటన ఖమ్మంపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన తుడుం నరేష్ (22) శుక్రవారం తన స్నేహితుడు సుదర్శన్‌కు ఫోన్ చేసి తాను చనిపోతున్నాను అని చెప్పి ఫోన్ స్విచ్ఛాప్ చేశాడు. దీంతో అతడు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మరో ఘనటనలో మహిళ..



నర్సమ్మ(ఫైల్)

మునిపల్లి, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి) : పూజా సామగ్రి తెచ్చేందుకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కంకోల్ గ్రామానికి చెందిన లింగంపల్లి నర్సమ్మ (55) ఇంట్లో పూజకు అవసరమైన సామగ్రిని తీసుకువచ్చేందుకు ఈ నెల 16న సదాశివపేటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామచంద్రాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కొత్త లైన్ పనులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు 33/11కే ఉస్మాన్‌నగర్ సబ్‌స్టేషన్ నుంచి అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శివశంకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు నివీగార్డెన్, ఎలియన్స్, రాజ్‌పుష్ప తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

'అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు'

హత్నూర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు అన్యాయం జరగకుండా చూస్తామని తహసీల్దార్ ఫర్హీన్ షేక్ అన్నారు. మండల పరిధిలోని నాగుల్‌దేవులపల్లి గ్రామంలో గ్రామ కార్యదర్శి భ్రమరాంబ అధ్యక్షతన నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడుతూ గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను నూటికి నూరు శాతం అర్హులైనవారికి అందేలా కమిటీ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సార పోచయ్య, బావికాడి నర్సింహులు, నడికేపు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 28 నుంచి వేసవి శిక్షణ తరగతులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఈనెల 28 నుంచి వచ్చే నెల 18 వరకు సంస్కార సాధనా వర్గ వేసవి శిక్షణా శిబిరం-2025 నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానాచార్యులు భూమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5-15 ల మధ్య వయస్సు గల బాలబాలికలకు చిత్ర లేఖనం, రంగులు వేయడం, సాంస్కృతిక కళలకు సంబంధించిన చెక్క భజన, యోగ్‌చాప్, కోలాటం, డంబుల్స్, భారతీయ ఆటలు, సదాచారానికి సంబంధించి నీతి కథలు, నిత్య ప్రార్థన శ్లోకాలు, భగవద్గీత శ్లోకాలు, కర్ర సాముల్లో రోజు ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. పూర్తి వివరాలకు 8099811208, 9391845888, 8143222295 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

చేగుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ మండలంలోని భీమ్రావు పల్లి గ్రామంలో మండల కోఆర్డినేటర్ జూకంటి రాజా గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం జై భీమ్, జై బాబు, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో కల్పించిన హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందన్నారు. అనంతరం అంబేద్కర్ వద్ద విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు కుర్మలక్ష్మి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మాజీ టెలికం బోర్డు మెంబర్ అంచనూర్ రాజేష్, గ్రామ అధ్యక్షుడు కుమార్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నిజాంపేట మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ రేణుక అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.15 వేలు మంజూరు కాగా, అందుకు సంబంధించిన ఆర్థిక సహాయం చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు జగన్‌చారి, పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు. కాగా వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ బహిరంగ సభ వాల్ రైటింగ్‌ను భూపాల్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కాగా ర్యాలమడుగు మాజీ ఎంపీటీసీ అమిర్యానాయక్ తల్లి మరణించడంతో ఆయనను భూపాల్‌రెడ్డి పరామర్శించారు.